



అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -37 మంగళవారం 7 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 4 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## యుద్ధోన్మాదులను చంపాల్సిందే

ఖమేనీ అంత్యక్రియలకు

భారీగా తరలి వస్తున్న జనం

ట్రంప్, నెతన్యాహూలపై ప్రజాగ్రహం

**టెహ్రాన్ జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**
ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగర వీధులు ప్రజా సందోహంతో కిక్కిరిసిపోయాయి. అమెరికా-ఇజ్రాయిల్ దాడులలో ప్రాణాలు కోల్పోయిన మాజీ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన**మిగతా 2లో...**

# పర్యాటకంకు పెద్దపీట

**తారామతి బారాదరి, దుర్గం చెరువుల అభివృద్ధి**

**మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌ల ఆధునికీకరణ**

**ఎకో టూరిజం పార్కుల అభివృద్ధికి చర్యలు**

**పర్యాటకంపై సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు**



**హైదరాబాద్,జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**
తారామతి బారాదరి, దుర్గం చెరువులను పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధికి అసవరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పర్యాటకశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని.. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి **మిగతా 2లో...**

## ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంప్ యార్డా?

**సిద్ధాపూర్ జీవోను ఉపసంహరించుకోవాలి**

**లేదంటే బాధితుల పక్షాన ఉద్యమం**

**: మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరిక**



2లో.

## జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

**కార్మికుల భద్రతకు ఎలాంటి రాజీ లేదు**

**ప్రాజెక్టు పూర్తితో 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు**

**ఆధునిక యంత్రాలతో పనులు వేగవంతం**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్,జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**
దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల కల అయిన ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టును జూన్ 2028 నాటికి తప్పకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. **మిగతా 2లో...**

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

**పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించాలి**

**బిఎల్‌వోలు సక్రమంగా పనిచేసేలా చూడాలి**

**కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**




**హైదరాబాద్,జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**
ఈ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నాటికి ఎట్టి పరిస్థితులలో పూర్తి చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి **మిగతా 2లో...**

## కడలిలో కల్లోలం

ఒకరు మృతి, ఆరుగురి గల్లంతు..

విశాఖలో కొనసాగుతున్న గాలింపు





**అనకాపల్లి తీరంలో పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి**

**నేవీ, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో సహాయక చర్యలు**

**సమాచారం కోసం మత్స్యకారుల కుటుంబసభ్యుల ఆందోళన**

**గాలింపు ముమ్మరం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం**

**విశాఖజూలై 6 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో సోమవారం రెండు వేర్వేరు విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. అనకాపల్లి జిల్లాలో పడవ బోల్తా పడిన ఘటనలో ఒక మత్స్యకారుడు మృతి చెందగా, విశాఖ తీరంలో గల్లంతైన**మిగతా 2లో...**

## కాళేశ్వరంపై పాపం కడుక్కోండి

**అసెంబ్లీకి వచ్చి నిజాలు చెప్పండి**

**లక్ష కోట్లు ఎలా,ఎందుకు ఖర్చు పెట్టారో చెప్పాలి**

**పేదలకు ఎందుకు ఇళ్లు నిర్మించలేదో చెప్పండి**

**కెసిఆర్‌కు సవాల్ చేసిన మంత్రి పొంగులేటి**

**సిద్దిపేట,జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**
గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి లక్షల కోట్ల రూపాయల నిధులు వచ్చిందని కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రాలేదని రాష్ట్ర రెవెన్యూ, **మిగతా 2లో...**



## ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

ఇండోనేషియాకు చేరుకున్న ప్రధాని మోడీ

గగనతలంలో యుద్ధవిమానాల ఎస్కార్ట్

ఘనంగా స్వాగతం పలికిన ఇండోనేసియా అధ్యక్షుడు



**న్యూఢిల్లీ,జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**
ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే **మిగతా 2లో...**

# ‘జర్నలిస్ట్ వార్త’కు స్పందన

**రోడ్డును పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్.. అధికారులకు ఆదేశాలు**

**త్వరలో సమస్యకు శాశ్వత పరిష్కారం: మంత్రి**



**ఎల్కతుర్తి/, జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్బీఐ సమీపంలో అసంపూర్తిగా ఉన్న రహదారిపై వర్షపు నీరు నిలిచి ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జర్నలిస్ట్ వార్త‘ లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రహదారిపై నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే శాశ్వత పరిష్కారం కోసం పనులు ప్రారంభిస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రహదారిని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను వేగవంతం చేయడంతో పాటు వర్షపు నీటి పారుదల కోసం అవసరమైన డ్రైనేజీ ఏర్పాట్లు కూడా చేపట్టాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. దీంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు


రోడ్డు తవ్వారు... మరిచారు!

వర్షం వస్తే చెరువే.. ప్రయాణికులకు కష్టకాలం

ఎల్కతుర్తి, /జూన్ 8 (జర్నలిస్ట్ వార్త)
ఎల్కతుర్తి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై చేపట్టిన మరమ్మతు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రోడ్డు గుంతల్లో నీరు నిలిచి చెరువును తలపిస్తుండటంతో వాహనదారులు, ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. దామెరచింతపల్లి మార్గంతో పాటు కాజీపేట, హన్మకొండ ప్రాంతాలకు నిత్యం బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో వందలాది మంది ప్రయాణిస్తున్నారు. అయితే మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో ఇటీవల రోడ్డు మరమ్మతుల పేరుతో రహదారిని లోతుగా తవ్వి పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ వాటిని మధ్యలోనే నిలిపివేయడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గత ఏడాది నుంచే ఈ రహదారి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, వర్షాకాలం రావడంతో సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై గుంతలు, బురద పేరుకుపోవడంతో వాహనాలు నెమ్మదిగా నడపాల్సి వస్తోందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ, రోడ్డు మరమ్మతుల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. దామెర నుంచి ఎల్కతుర్తి వరకు రహదారి అధ్వాన్నంగా ఉండటంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. సుమారు 150 మీటర్ల మేర రహదారిని లోతుగా తవ్వి పనులు ఎందుకు నిలిపివేశారో అర్థం కావడం లేదని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిలిచిపోయిన రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేయడంతో పాటు ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరగకముందే అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

**మొదటిపేజీ తరువాయి**

లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పర్యటనకు బయలుదేరారు. జులై 6 నుంచి 11 వరకు కొనసాగనున్న ఈ ఆరు రోజుల పర్యటనలో ఆయా దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు మోదీ. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇండో-పసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. అలాగే భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ సమావేశం కానున్నారు. పర్యటనకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలు భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్‌కు మరింత బలం చేకూరుస్తాయని ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణంపై భారత్ నిబద్ధతను ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జులై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధానిగా నరేంద్ర మోదీ నాలుగోసారి ఇండోనేషియాలో పర్యటిస్తున్నారు. జకార్తాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ప్రధాని మోదీ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించనున్నారు. అనంతరం భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు. అలాగే యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న యోగ్యకర్తలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఇండోనేషియా పర్యటన అనంతరం జులై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అలాగే ఆ దేశ గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. భారతీయ ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఆస్ట్రేలియాపర్యటన అనంతరం జులై 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగనుంది. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌ను సందర్శిస్తున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ నిలవనున్నారు. ఆక్‌లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ద్వైపాక్షిక సహకారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. గత రెండేళ్లలో ఇరు దేశాల మధ్య ముఖ్యంగా వాణిజ్యం, రక్షణ రంగాల్లో నమోదైన పురోగతిని సమీక్షించ నున్నారు. అదే సమయంలో ప్రముఖ వ్యాపార, క్రీడా రంగాల ప్రముఖులతోనూ ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం కానున్నారు. ఆ తర్వాత భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు.

# జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

**మొదటిపేజీ తరువాయి**

అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. రోజున డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి, ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఎ÷-లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు. పనుల వేగం ఎంత ముఖ్యమైనదైనా, కార్మికుల భద్రత దానికంటే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. టన్నెల్ అంతటా తగిన లైటింగ్, సమర్థవంతమైన వెంటిలేషన్, సీనియర్ జియాలజిస్టులు, అథారిటీ ఇంజినీర్లు, నిపుణుల నిరంతర పర్యవేక్షణతో పనులు కొనసాగించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. న్నెల్ వద్ద పనిచేసే సిబ్బందిని ఇప్పటికే మూడింతలు పెంచినట్లు, అదనపు యంత్రాలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక నిపుణులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిండి ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్‌వర్క్ పూర్తయితేనే ఎస్ఎల్‌బీసీ పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని

మంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే పక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హై లెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, కాలువల సామర్థ్య పెంపు పనులపైనా సమీక్ష నిర్వహించిన మంత్రి, అవసరమైన చోట కాలువలను విస్తరించి భవిష్యత్తులో అదనపు నీటి ప్రవాహాలను సురక్షితంగా మోయగల విధంగా రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. 'ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను జూన్?2028 నాటికి అన్ని విధాలుగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులు దక్షిణ తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా, ఎ÷-లోరైడ్ బాధిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించి ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ చూపిస్తాయి' అని అన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) వి. రమేష్ బాబు, ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంప్ యార్డా?

**సిద్ధాపూర్ జీవోను ఉపసంహరించుకోవాలి**

**లేదంటే బాధితుల పక్షాన ఉద్యమం**

**: మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరిక**



**హైదరాబాద్‌జూలై 6 (జర్నలిస్ట్ వార్త):** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో డంప్ యార్డు ఏర్పాటు నిర్ణయంతో స్థానిక రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు అన్నారు. ఐటీ పార్క్ నిర్మించాల్సిన ప్రాంతంలో డంప్‌యార్డు పెట్టడం సరైంది కాదని చెప్పారు. సిద్ధాపూర్‌లో డంప్ యార్డు జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లో బాధిత రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. డంప్ యార్డు వల్ల వారు ఏ విధంగా నష్టపోతున్నారో వివరించారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడాలనీ, న్యాయం జరిగేలా చూడాలని వారు ఆయన్ను కోరారు. రైతుల వినతిపై స్పందించిన హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. సిద్ధాపూర్ గ్రామంలో 86 ఎకరాల్లో డంప్ యార్డు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 641 తీసుకురావడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. పచ్చని వ్యవసాయ భూముల మధ్య, జనావాసాలకు సమీపంలో డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనమని అన్నారు. ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. సిద్ధాపూర్‌తోపాటు చుట్టుపక్కల ఉన్న దాదాపు 20 గ్రామాలు ఈ డంప్ యార్డు వల్ల తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గ్రామాల ప్రజలంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరానికి అవసరమైన కూరగాయలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలానికి ఆనుకుని ఉన్న 'గుట్ట చెరువు' నీటితోనే ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని చెప్పారు. ఇప్పుడు ఆ చెరువు పక్కనే డంప్ యార్డు పెడితే ఆ నీరు పూర్తిగా కలుషితమై, సాగు నీటితోపాటు తాగునీటికీ తీవ్ర ముప్పు వాటిల్లుతుందని అన్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన జహంగీర్ పీర్ (జేపీ) దర్గా కూడా ఇక్కడే ఉండటంతో, ఆ కాలుష్యం స్థానికులతోపాటు భక్తులకు కూడా శాపంగా మారడం ఖాయమని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో, డంప్ యార్డుకు కేటాయించిన సర్వే నెంబర్లు 252, 278, 361లో ఉన్న 334 ఎకరాల్లో ఐటీ పార్క్ నిర్మించాలని తాము ప్రణాళికలు రూపొందించామని గుర్తు చేశారు. అక్కడ ఐటీ పార్క్ వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని సంకల్పించామని అన్నారు. ఉపాధి కల్పించాల్సిన భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వం డంప్ యార్డు ఏర్పాటు చేసి స్థానిక ప్రజల బతుకులను చిదిమేయాలని చూడటం శోచనీయమని విమర్శించారు. యువత కు అవకాశాలు కల్పించాల్సిన చోట కాలుష్యాన్ని, రోగాలను ఇవ్వడమే ప్రజా పాలనా?అని ప్రశ్నించారు. ప్రభుత్వం డంప్ యార్డులను ఏర్పాటు చేయాల నుకుంటే ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలగని చోట, జనావాసాలు, గ్రామాలు లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలా పచ్చని పల్లెలను, పొలాలను, రైతులను ఆగమాగం చేయడం ఏమాత్రం తగదని హెచ్చరించారు.

# యుద్ధోన్మాదులను చంపాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**

ప్రజానీకం కన్నీరుమున్నీరవుతున్నారు. కొందరైతే ఆగ్రహం పట్టలేక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూలను హతమార్చాలని డిమాండ్ చేశారు. ఉదయం ప్రార్థనలు ప్రారంభం కావడానికి ముందే ప్రజలు పెద్ద ఎత్తున గ్రాండ్ మొసల్లాకు చేరుకున్నారు. ఇరాన్ పతాకాలతో పాటు ప్రతీకారానికి చిహ్నంగా ఎర్ర జెండాలను, ఖమేనీ చిత్ర పటాలను పట్టుకొని అమెరికా, ఇజ్రాయిల్ దేశాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంత్యక్రియలు ప్రారంభమైన రోజుతో పోలిస్తే జనం తాకిడి చాలా ఎక్కువగా ఉంది. వాతావరణం ఉద్రేకపూరితంగా కన్పించింది. 'ప్రపంచంలోనే అత్యంత నీచమైన వ్యక్తి ఇంకా ఎందుకు జీవించి ఉన్నాడు? ట్రంప్‌కు ఈ ప్రపంచం ఇక ఎంత మాత్రం మంచి ప్రదేశం కాదు. మన ఇమామ్‌ను చంపిన వ్యక్తిని మనం ఎందుకు చంపకూడదు? మనం అలా చేయకపోతే అవమానకరం అవుతుంది' అని మహమ్మద్ రసూలీ అనే కవి జనసమూహాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అన్నారు. రసూలీ ప్రసంగిస్తున్నంత సేపూ ప్రజలు కరతాళధ్వనులతో తమ మద్దతు తెలియజేశారు. 'ట్రంప్‌ను చంపాల్సిందే' అని రాసి ఉన్న ప్లకార్డు ఓ వ్యక్తి చేతిలో కన్పించింది. అమెరికా-ఇజ్రాయిల్ సేనల దాడులు మొదలైన తర్వాత ఇరాన్ రాజకీయ, సైనిక నాయకత్వం బహిరంగంగా కలిసి కనిపించడం ఇదే మొదటిసారి. 'మీరు మనుషులను చంపగలరు. కానీ ఆదర్శాలను కాదు' అని అర్మేనియాలోని ఇరాన్ రాయబారి ఖలీల్ షిర్గోలామీ అన్నారు. పశ్చిమ దేశాలకు నాగరికత, చరిత్ర, గౌరవం లేవని మండిపడ్డారు. శత్రువులపై పగ, ఖమేనీ రక్తానికి ప్రతీకారం తీర్చుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మహమ్మద్ బఘేల్ జోల్గదర్ చెప్పారు. కాగా యుద్ధ సమయంలో ప్రజలకు దూరంగా ఉన్న పలువురు నేతలు, సైనికాధికారులు అంత్యక్రియలలో కనిపించారని 'ది గార్డియన్' పత్రిక తెలిపింది. ఖమేనీ కుమారులు ముస్తఫా, మసూద్, మెయిసామ్‌లు తండ్రి శవపేటిక పక్కనే నిలబడ్డారు. సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ మాత్రం హాజరు కాలేదు. భార్య అంత్యక్రియలకు కూడా ఆయన వెళ్లలేదు. ఖోమ్‌కు చెందిన 97 ఏండ్ల మతగురువు నేతృత్వంలో ప్రార్థనలు జరిగాయి. యుద్ధోన్మాదానికి బలైన 14 నెలల ఖమేనీ మనుమరాలి శవపేటికను చూసి జనం భోరున విలపించారు. ఖమేనీ జన్మస్థలమైన మషద్‌లోని ఇమామ్ రెజా మందిరంలో ఖననం చేయడానికి ముందు పార్థివ దేహాన్ని ఇరాన్, ఇరాక్ మీదుగా ఊరేగింపుగా తీసికెళతారు. ఖమేనీ అంత్యక్రియల ఊరేగింపులో పాల్గొనేందుకు ప్రజలు సోమవారం నల్లని దుస్తులు ధరించి భారీగా తరలి వచ్చారు. ఖమేనీ భౌతికకాయం ఉన్న శవపేటికతో పాటు ఆయన కుటుంబ సభ్యుల శవపేటికలను కూడా ఓ ట్రక్కుపై ఉంచారు. శవపేటికలను టెహ్రాన్ వీధుల మీదుగా మెహ్రాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలిస్తు న్నారు. ఈ ప్రయాణానికి 12 గంటలకు పైగా సమయం పడుతుంది. ఊరేగింపు సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున కవాతు జరిపారు.

# పర్యాటకంకు పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి**

చేయాలన్నారు. అక్కడ వీరభద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీశాఖ భూములను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలన్నారు. గుర్రంగూడ ఎకో పార్కు తరహాలో నగరంలో మరిన్ని పార్కులను తీర్చిదిద్దాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలి. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకాధికారులను నియమించాలన్నారు. పురానాపూల్, హెరిటేజ్ బ్రిడ్జిలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. ట్రాఫిక్‌ను మళ్లించి బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి. డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్ ఏర్పాట్లు ప్రారంభించాలని సీఎం రేవంత్ దిశానిర్దేశర చేశారు.

# కడలిలో కల్లోలం

**మొదటిపేజీ తరువాయి**

ఆరుగురు మత్స్యకారుల కోసం రెండో రోజూ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ రెండు సంఘటనలతో మత్స్యకార గ్రామాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా రేవూపోలవరం తీరంలో నలుగురు మత్స్యకారులతో వెళుతున్న పడవ అలల ఉద్ధృతికి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు సురక్షితంగా ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. చోడిపల్లి సింహాద్రి (రేవూపోలవరం వాసి) అనే మత్స్యకారుడు గల్లంతై మృతి చెందాడు. అతని మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. మరోవైపు విశాఖ తీరంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం భారత నావికాదళం, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు సంయుక్తంగా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. హెలికాప్టర్, ప్రత్యేక నౌక, రెస్క్యూ బోట్లతో గాలింపును కొనసాగిస్తున్నారు. ఈ ఘటనలో కార్గో షిప్ ద్వారా రక్షించబడిన కారి చిన్న అనే మత్స్యకారుడు (బోటు యజమాని) ఇచ్చిన సమాచారం ఆధారంగా సహాయక చర్యలు జరుగుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి 72 గంటలు చాలా కీలకమని, మత్స్యకారులు ప్రాణాలతో దొరుకుతారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి, గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఐజీ గోపీనాథ్ జెట్టి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారడంతో, ఈ నెల 1న వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. గల్లంతైన తమ వారి గురించి సరైన సమాచారం అందించడం లేదంటూ వారి కుటుంబసభ్యులు విశాఖలో ఆందోళన చేపట్టారు. దీంతో తీర ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# కాళేశ్వరంపై పాపం కడుక్కోండి

**మొదటిపేజీ తరువాయి**

గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది వాళ్లే, దాన్ని ఓపెన్ చేసింది వాళ్లే, చివరకు అది కూలిపోయింది కూడా వాళ్ల హయాంలోనేనని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు వాళ్లే కాళేశ్వరం దగ్గరకు పోయి తామేదో చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వివేక్

వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచితే కింద ఉన్న ప్రాంతమంతా కొట్టుకుపోతుందని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించినా, బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు కట్టినప్పుడు గత పాలకులకు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే కాళేశ్వరానికి ఈ గతి పట్టేది కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. కేవలం అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం ఆపాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి కేసీఆర్ ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలి. కాళేశ్వరాన్ని ఎలా కట్టారో సమాధానం చెప్పి.. తాము చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని సవాల్ విసిరారు. వారు ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదికగా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ సభకు వచ్చి కాళేశ్వరంపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే కాళేశ్వరం కట్టారని.. ఆ ప్రాజెక్టు పేరుతో నిధులు మెక్కారని ఎద్దేవా చేశారు. కానీ నిందలేమో తమ ప్రభుత్వంపై వేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. ప్రతిసారి కర్రు కాల్చి వాత పెడుతున్నారని హెచ్చరించారు. పేదోడి కష్టం తెలియని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రం కాళేశ్వరం కట్టడానికి లక్ష కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. అధికారం కావాలనే దాహంతో తమ ప్రభుత్వంపై నిందలు మోపడం బీఆర్ఎస్ నేతలు ఆపాలని హితవు పలికారు. చిత్తశుద్ధితో సలహాలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీకి రావాలని కోరారు. ప్రపంచంలో ఉన్న ఏడు వింతలు కాదని.. ఎనిమిదో వింత కాళేశ్వరమని ఆనాడు చెప్పిన పెద్దమనిషి అసెంబ్లీకి రావాలని సూచించారు. కాళేశ్వరం ఎలా కట్టారో చెప్పాలని, కేసీఆర్ తెలంగాణకు చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అసంపూర్తిగా కట్టి మధ్యలోనే వదిలేశారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వదిలేసిన ఆ అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్నింటినీ రిపేర్ చేసి త్వరలోనే పేదలకు అందిస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తల తాకట్టు పెట్టి అయినా సరే, అర్హులైన ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే తమ ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 32 వేల పూరి గుడిసెలు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మొదటి విడతలో ఇవ్వలేక పోయిన వాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇస్తామని.. వారికే మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. ఏ పార్టీల్లోని లబ్దిదారులైనా.. పైరవీ లేకుండా చిత్తశుద్ధితో ఇళ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో సిద్దిపేట గజ్వేల్, సిరిసిల్ల, నియోజకవర్గాల్లో మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అత్యధికంగా కట్టుకున్నారని చెప్పారు. వేరే నియోజకవర్గాల్లో అరకొరగా 50, 60 ఇళ్లు కట్టి అసంపూర్తిగానే వదిలేశారని తెలిపారు. రెండోవిడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వ్యాఖ్యానించారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కూడా డబ్బులు ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయించామని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

**మొదటిపేజీ తరువాయి**

జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించి వందశాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర్లు తో కలిసి సోమవారం ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమ పురోగతిపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో సూపర్ వైజర్ల ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఎక్కడైతే బిఎల్‌ఒలు బలహీనంగా ఉన్నారో వారిని గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో వారికి సూపర్ వైజర్లు సహకరించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో స్థానికంగా వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా పూరించేందుకు ఓటర్లకు సహకరించాలని సూచించారు. సంబంధిత సూపర్ వైజర్ల ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా తెలియజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. హైదరబాద్లో ఇప్పటికే ప్రారంభమైన 16 హెల్ప్ డెస్క్ లతో పాటు అవసరమైన చోట అదనంగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. పూర్తయిన ఎన్యూమరేషన్ ఫారాలలో సదరు ఓటరు, బిఎల్‌ఒ సంతకాలు ఉండేలా చూడాలని దీంతో పాటు ఫోటోలు ఉండేలా చూడాలని సిఇఒ ఆదేశించారు. ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సర్ పక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలకు సంబంధించి డిజిటలైజేషన్ పక్రియను ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పక్రియను కూడా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వివిధ పోలింగ్ కేంద్రాలలో కాకుండా ఒకే పోలింగ్ కేంద్రంలో వారి పేర్లు ఉండేవిధంగా చూడాలన్నారు. ఆన్ లైన్ ద్వారా వచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను కూడా బిఎల్‌ఒలు సరి చూసు కోవాలని, ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో మరోసారి బిఎల్‌ఒలకు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. బిఎల్‌ఒలు తప్పనిసరిగా రాజకీయ పార్టీలతో సమావేశాలు జరిగేవిధంగా చూడాలని, సర్ పక్రియపై వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఇఒ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, చిరంజీవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దండోరా ప్రస్థానం

## నేడు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ప్రత్యేకం

తెలుగు నేలపై అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతీకగా, హక్కుల పోరాట శంఖారవంగా నిలిచిన 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నేటితో విజయవంతంగా 32వ వసంతంలోకి అడుగుపెడుతోంది. 1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో కేవలం 20 మంది యువకులతో, ఒక చిన్న విత్తనంలా ప్రారంభమైన ఈ ఉద్యమం.. నేడు దేశ సామాజిక, రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే స్థాయికి ఎదిగింది. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ప్రారంభమై, సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పుతో విజయం సాధించే వరకు సాగిన ఎమ్మార్పీఎస్ ప్రస్థానం అనన్యసామాన్యం. మందకృష్ణ మాదిగ సారథ్యంలో సాగిన ఈ మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాట విశేషాలపై

**ఈదుమూడి చెట్టు కింద చిన్న కాగడా**

ఎనభై, తొంభైల కాలంలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) రిజర్వేషన్ ఫలాలు ఒకే సామాజిక వర్గానికి పరిమితమవుతున్నాయనే ఆవేదన, ఆక్రోశం మాదిగ ఉపకులాల్లో తీవ్రమైంది. జనాభాలో సగానికి పైగా ఉండి కూడా విద్య, ఉద్యోగాల్లో కనీస వాటా దక్కని దుస్థితి నెలకొంది. ఈ అసమానతను ప్రశ్నిస్తూ వరంగల్ జిల్లా శాయంపేటకు చెందిన మందకృష్ణ మాదిగ ఉద్యమ బాట పట్టారు. 1994 జూలై 7న కొద్దిమంది మిత్రులతో కలిసి ఎమ్మార్పీఎస్ వేదికను స్థాపించారు. చేతిలో 'దప్పు'.. గొంతులో 'దండోరా' మోగిస్తూ పల్లెపల్లెకూ ఈ ఉద్యమ కాగడాను తీసుకెళ్లారు. అణచివేతకు గురైన గుండెల్లో హక్కుల చేవను నింపారు.

**నేడు: పద్మశ్రీ గౌరవం. సుప్రీంకోర్టు విజయం**

సరిగ్గా ముప్పై ఏళ్ల పాటు అలుపెరగని సత్యాగ్రహాలు, పాదయాత్రలు, జైలు శిక్షలు, ఆత్మబలిదానాల తర్వాత ఎమ్మార్పీఎస్ అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. ఎస్సీ వర్గీకరణ చెల్లుతుందని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ఈ పోరాట ఫలితమే. మూడు దశాబ్దాల పాటు శాంతియుత మార్గంలో ఒక అణగారిన




సామాజిక వర్గం కోసం నిరంతరం శ్రమించిన మందకృష్ణ మాదిగ సామాజిక సేవను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం గతేడాది అత్యున్నత 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. నాటి ఈదుమూడి చిన్న సమావేశం.. నేడు ఢిల్లీ పీఠాన్ని కదిలించే మహోద్యమంగా రూపాంతరం చెందింది.

**చరిత్ర సృష్టించిన ప్రధాన పోరాటాలు**

ఎమ్మార్పీఎస్ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు ఉన్నాయి. శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లో వీరు చేసిన పోరాటాలు దేశ చరిత్రలోనే నిలిచిపోయాయి:

**మహా పాదయాత్ర (1997):** నరవారిపల్లె నుంచి హైదరాబాద్ వరకు 1,052 కిలోమీటర్ల మేర సాగిన సుదీర్ఘ పాదయాత్ర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను కదిలించింది. చలో హైదరాబాద్ (1996): సుమారు 5 లక్షల మందితో నిజాం కాలేజీ మైదానంలో నిర్వహించిన ఈ భారీ ర్యాలీ. వర్గీకరణ దిశగా నాటి ప్రభుత్వాన్ని జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ వేసేలా ఒత్తిడి తెచ్చింది. ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద, తెలుగు రాష్ట్రాల్లో మందకృష్ణ పలుమార్లు ప్రాణాలను పణంగా పెట్టి చేసిన దీక్షలు జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించాయి.

**కేవలం వర్గీకరణే కాదు.. సామాజిక సేవలో అగ్రగామి**

ఎమ్మార్పీఎస్ అంటే కేవలం కుల రిజర్వేషన్ల పోరాటం మాత్రమే కాదు. సమాజంలో అట్టడుగున ఉన్న ప్రతి ఒక్కరి కోసం మందకృష్ణ మాదిగ చేతులు చాచారు. గుండె జబ్బులతో బాధపడుతున్న పేద చిన్నారుల కోసం దండోరా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమించారు. నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి, ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేలా ఆరోగ్యశ్రీ' పథకానికి ఈ పోరాటమే బీజం వేసింది.

వికలాంగుల హక్కులు (2007): 'వికలాంగుల హక్కుల పోరాట సమితి'ని స్థాపించి 'మహా గర్జన' ద్వారా నాటి రూ.200 పింఛన్‌ను పెంచేలా, వారికి 3% ఉద్యోగ రిజర్వేషన్లు అమలయ్యేలా పోరాడారు.

వృద్ధులు, ఒంటరి మహిళల పక్షాన: సమాజంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్ల పెంపు కోసం, వారి ఆత్మగౌరవం కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం గొంతుకై నిలిచింది.

**ముగింపు: ఆశయ సాధన దిశగా..**

సాధించిన విజయాలు ఒక ఎత్తయితే.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలు చేయించుకోవడం, విద్యా-ఉద్యోగ రంగాల్లో మాదిగ ఉపకులాల వాటాను సాధించుకోవడం ప్రస్తుత తక్షణ కర్తవ్యం. ఒక కుల వివక్షపై మొదలైన పోరాటం.. నేడు సమసమాజ స్థాపన వైపు, మానవ హక్కుల పరిరక్షణ వైపు అడుగులు వేస్తోంది. 32వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న వేళ.దండోరా వీరుల త్యాగాలు, మందకృష్ణ మాదిగ నిరంతర పోరాట స్ఫూర్తి రాబోయే తరాలకు ఆదర్శం.

# ఎంఈఓగా శ్రీదేవి బాధ్యతలు.. పీఆర్టీయూ ఘన సన్మానం





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 6 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండల విద్యాశాఖాధికారిగా (ఎంఈఓ) పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన పెద్దపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి బి. శ్రీదేవిని పీఆర్టీయూ ధర్మసాగర్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. మండల శాఖ అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జాన్ సింగ్ నాయకత్వంలో ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, ధర్మసాగర్ మండల విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాల పెంపునకు, ఉపాధ్యాయులువిద్యార్థుల సంక్షేమానికి శ్రీమతి బి. శ్రీదేవి సమర్థవంతమైన నాయకత్వం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతల్లో ఆమె విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

శ్రీమతి బి. శ్రీదేవి కూడా పీఆర్టీయూ నాయకులు అందించిన అభినందనలకు కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల సమన్వయంతో మండలంలోని విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి బాధ్యులు, గౌరవ సభ్యులు, ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మండల శాఖ నాయకత్వం పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేసింది.

# ఒక్క వానకే జలమయం..

# రాకపోకలకు అడ్డంకి

### ఎస్బీఐ సమీపంలో అసంపూర్తి రహదారిపై వాహనదారుల ఆవేదన

**ఎల్కతుర్తి,/ జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**

ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఒక్క వానకే ప్రధాన రహదారి జలమయమవుతుండటంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దామెరఎల్కతుర్తి ప్రధాన రహదారిపై స్థానిక ఎస్బీఐ సమీపంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. లక్షల రూపాయల వ్యయంతో రహదారి నిర్మాణం చేపట్టినా, సుమారు 100 మీటర్ల మేర పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతోనే ఈ పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సిద్ధిపేటహనుమకొండ ప్రధాన రహదారి పనులు పూర్తయినా, ఎస్బీఐ వద్ద మాత్రం రహదారి అసంపూర్తిగా ఉండటంతో ప్రతి వర్షానికీ నీరు నిలిచి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఈ సమస్యపై అధికారులు, గ్రామపంచాయతీ స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసి, వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. స్థానిక మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# ఖమ్మంలో అధ్వాన్నంగా పారిశుద్ధ్యం

### మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం,జూలై 6 (జర్నలిస్ట్ వార్త):** పారిశుద్ధ్య నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే సమగ్ర ప్రణాళిక రూపొందించి పారిశుద్ధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఖమ్మం జిల్లాను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. పారిశుద్ధ్యం లోపించడం అపరిశుభ్రత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిచోటా చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

# బాలిక కిడ్నాప్ కేసులో నలుగురిపై పోక్సో కేసు

**ఖమ్మం,జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**కారేపల్లి మండల కేంద్రంలో గల ఓ ప్రభుత్వ గురుకుల కళాశాల నుండి ఇంటర్ చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసిన నలుగురు వ్యక్తులపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు కాగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు కారేపల్లి పోలీసులు సోమవారం తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దుర్గాభవాని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం పట్టణంలోని టేకులపల్లి ప్రాంతంలో నివాసముంటూ నిందితుడికి సహకరించిన మరో ముగ్గురు మహిళలను కూడా ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

# దాతలూ... నా తండ్రిని కాపాడండి..!

### రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తండ్రి కోసం కుమారుడి ఆర్తనాదం

**తల్లాడ, /జూలై 6 (జర్నలిస్ట్ వార్త)**






"మా నాన్నే మా కుటుంబానికి పెద్ద దిక్కు... ఆయన మంచాన పడడంతో మా జీవితం అంధకారంలోకి వెళ్లిపోయింది. దయచేసి మీ వంతు సాయం చేసి మా నాన్న ప్రాణాలు కాపాడండి..." అంటూ ఓ కుమారుడు వేడుకుంటున్న హృదయ విదారక ఘటన ఖమ్మం జిల్లా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బేగ్ అల్లిబాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. గుర్తుతెలియని వాహనం ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పరారవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఖమ్మంలోని ఇండస్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు అత్యవసర బ్రెయిన్ సర్జరీ నిర్వహించారు. చికిత్సకు సుమారు రూ.6 లక్షలకు పైగా ఖర్చవుతుందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఇప్పటికే కుటుంబ సభ్యులు అప్పులు చేసి చికిత్స కొనసాగిస్తున్నా, రోజురోజుకూ పెరుగుతున్న వైద్య ఖర్చులను భరించే స్తోమత లేక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. రోజువారీ కూలి పనులపై ఆధారపడే ఈ కుటుంబానికి ప్రస్తుతం దాతల సహాయమే ఆధారంగా మారింది. మానవత్వంతో స్పందించి తమ తండ్రి ప్రాణాలను కాపాడాలని బేగ్ అల్లిబాబు కుమారుడు బేగ్ నాగుల్ మీరా కన్నీటి పర్యంతమై వేడుకున్నారు. సాయం చేయదలిచిన దాతలు ఫోన్‌పే/గూగుల్ పే నంబర్: 9704405388 ద్వారా తమ వంతు ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# చర్చిలు, మసీదులు, దేవాలయాలు, పాఠశాలల సమీపంలోని బెల్ట్ షాపులు రద్దు చేయాలి

### జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం.. అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**తల్లాడ/, జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**

తల్లాడ మండలంలో చర్చిలు, మసీదులు, దేవాలయాలు, పాఠశాలల సమీపంలో కొనసాగుతున్న అక్రమ బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా నూతన్‌కల్‌లోని లా సాలెట్టే మాతా ఆర్‌సీఎం చర్చి పరిసరాల్లో, అలాగే మండలంలోని ఇతర ఆర్‌సీఎం చర్చిల సమీపంలో బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. చర్చి ప్రాంగణాల వద్ద పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయాలు జరుగుతుండటంతో మద్యం సేవించిన వ్యక్తులు గుమిగూడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారీ లారీలను చర్చి ముందు నిలిపివేసి డ్రైవర్లు బహిరంగంగా మద్యం సేవించడం, మూత్రవిసర్జన చేయడం వల్ల మహిళలు, చిన్నారులు, ప్రార్థనలకు వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చర్చి ప్రాంగణంలో పిల్లలకు మతబోధన, ట్యూషన్లు, ఇతర విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో మద్యం విక్రయాలు వారి నైతిక వికాసంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పారిష్ ప్రీస్ట్ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, బాలికల భద్రతకు ముప్పుగా మారుతున్న పరిస్థితులను వెంటనే అరికట్టాలని కోరారు. మరోవైపు తల్లాడ మండలంతో పాటు సత్తుపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి ఒక్కో క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తూ మద్యం విక్రయిస్తున్నారని తెలిపారు. బీర్లు, ఇతర బ్రాండ్ల ధరలను కూడా ఇష్టారాజ్యంగా పెంచి వినియోగదారులను దోచుకుంటున్నారని ఆరోపించారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి అధిక ధరలకు మద్యం విక్రయించడంతో పాటు డోర్ డెలివరీ కూడా నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ అబ్కారీ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పాఠశాలల పరిసరాల్లో అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా నిర్మూలించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌తో పాటు అబ్కారీ శాఖ ఉన్నతాధికారులను ప్రజలు కోరారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సులపై ఆర్టీఏ కొరడా

### 9 వాహనాలపై చర్యలు.. 3 బస్సులు సీజ్, 2 పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

**నర్సంపేట/, జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**



నర్సంపేట పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల బస్సులపై ఆర్టీఏ అధికారులు, స్థానిక పోలీసులు సోమవారం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాగిన తనిఖీల్లో పలు నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. అక్షర బిట్స్, గీతాంజలి డీజీ, డఫోడిల్ పాఠశాలల బస్సులను పరిశీలించిన అధికారులు, 40 మంది విద్యార్థుల సామర్థ్యం ఉన్న బస్సులో 52 మందిని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో మూడు బస్సులను సీజ్ చేశారు. గీతాంజలి డీజీ స్కూల్ బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు) 2022లో రీఫిల్ చేసినవేనని, 2024లో తిరిగి రీఫిల్ చేయాల్సి ఉన్నప్పటికీ చేయలేదని అధికారులు గుర్తించారు. అలాగే ప్రథమ చికిత్స కిట్లు లేకపోవడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని రెండు వాహనాలను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మొత్తంగా తొమ్మిది బస్సులపై వివిధ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో వెహికల్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ఉదయ్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# 'సార్.. పరేషాన్!'

### బీఎల్‌వోలకు ఎన్యూమరేషన్ ఫారాల తలనొప్పి

### 400-700 ఫారాలతో ఉక్కిరిబిక్కిరి.. క్షేత్రస్థాయిలో సహకారం లేదని ఆవేదన

**ఎల్కతుర్తి,/ జులై 6(జర్నలిస్ట్ వార్త)**



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల భర్తీ ప్రక్రియ ఎల్కతుర్తి మండలంలోని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు)కు తలనొప్పిగా మారింది. ఒక్కో బీఎల్‌వోకు 400 నుంచి 700 వరకు ఫారాలు కేటాయించడంతో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించడం, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం తీవ్ర ఇబ్బందిగా మారిందని వారు వాపోతున్నారు.

మండలంలోని 20 గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ ఉద్యోగులు బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్నారు. నిరక్షరాస్యులైన ఓటర్లతో ఫారాలు నింపించడం, కుటుంబ సభ్యుల వివరాలు, ఫోన్ నంబర్లు, ఇతర సమాచారం నమోదు చేయడం చాలా సమయం తీసుకుంటోందని చెబుతున్నారు. సాంకేతిక సమస్యలు, ఆన్‌లైన్ పోర్టల్ ఇబ్బందులు మరింత ఒత్తిడిని పెంచుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడువు సమీపిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల నుంచి తగిన మార్గదర్శకత్వం, పర్యవేక్షణ లేకపోవడంతో బీఎల్‌వోలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. ఎన్యూమరేషన్ ఫారాల భర్తీపై స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు ప్రతి బీఎల్‌వోకు ఒక అసిస్టెంట్‌ను నియమించాలని కోరుతున్నారు. అలాగే ఎన్నికల కమిషన్ గడువును పొడిగించి ప్రక్రియను సులభతరం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అక్రమాలపై వార్తలు రాసిన విలేకరులపై దాడికి కుట్రలు.

**బయ్యారం/,జులై 6.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలంలో ఈ నెల ఒకటో తేది నుండి కంబాలపల్లి సబ్ సెంటర్ లో ఎరువుల విక్రయాల అక్రమాలపై వస్తున్న వరుస వార్త కథనాల నేపథ్యంలో వార్తలు రాసిన విలేకరులపై దాడికి భారీ కుట్ర జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.మేము అవాస్తవాలు రాస్తే చట్టపరంగా వెళ్లవచ్చు.. పరిష్కారం చూసుకోవచ్చు. .అందుకు భిన్నంగా విలేకరుల ఇండ్లపై దాడి చేసి,మా కుల సంఘాలతో కలిసి మేమే కేసులు పెడతామంటూ బహిరంగంగా కొంతమంది ఎదుట చర్చించటం, పలువురికి ఫోన్ లు చేసి చెప్పడం జరుగుతుందని సమాచారం. అక్రమాలు చేయడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేస్తే భయపడి పోతారని,వారి ఇండ్లపై కుల సంఘాలతో వెళ్లి ఇంటిపై దాడి చేస్తామని ఎవరు అడ్డు వస్తారో చూస్తామని సదరు ఉద్యోగి పలువురు దగ్గర మాట్లాడుతున్నట్లు నిఘ వర్గాల సమాచారం.

# రూ.13 కోట్లతో ఎల్కతుర్తిమడిపల్లి బీటీ రోడ్డుకు శంకుస్థాపన

## ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్





**ఎల్కతుర్తి,/ జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎల్కతుర్తి జంక్షన్ నుంచి మడిపల్లి వరకు రూ.13 కోట్లతో చేపట్టనున్న 3.5 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణ పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం శంకుస్థాపన చేశారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కుడా వైస్ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్కతుర్తి జంక్షన్‌మడిపల్లి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడంలో కృషి చేసిన కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను అభినందించారు. రహదారి పూర్తయితే మండల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందడంతో పాటు వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్య రంగాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.
మండల కేంద్రంలో కోర్టు, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి మౌలిక వసతులు ఏర్పాటవుతున్న నేపథ్యంలో ఈ రహదారి మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుందని, పరిసర ప్రాంతాల అభివృద్ధికి దోహదపడటంతో పాటు భూముల విలువ కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న ఇతర రహదారి అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గోలి రాజేశ్వర్‌రావు, బక్కి వెంకన్న, అక్తర్ అలీ, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు దుస్తుల పంపిణీ..

## -సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ.



**బయ్యారం/,జులై 6.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని జగ్గుతండ గ్రామపంచాయతిలోని బీసీ కాలనీలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఉచితంగా దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ హాజరై విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ ప్రజలకు సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.చిన్నారులు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరై పోషకాహారంతో పాటు ప్రాథమిక విద్యను అభ్యసించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పద్మ,ముకుంద, అంగన్వాడి ఆయా బుల్లి,తదితరులు పాల్గొన్నారు.

# వెలుగులోకి వస్తున్న కంబాలపల్లి సబ్ సెంటర్ ఉద్యోగి అక్రమాలు...?

**బయ్యారం/,జులై 6.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నడిచే కంబాలపల్లి సబ్ సెంటర్ ఉద్యోగి రైతులను నిలువు దోపిడీ చేస్తూ వచ్చిన డబ్బులను తన జేబులో వేసుకుంటున్నట్లు సమాచారం.కంబాలపల్లి సబ్ సెంటర్ లో గత సంవత్సరం 2025 డిసెంబర్ నుంచి ఈనెల జూలై 1 వరకు కంబాలపల్లి సబ్ సెంటర్ కు 10,510 యూరియా బస్తాలు దిగుమతి అయ్యాయి.అ దిగుమతి అయినా యూరియా బస్తాకు 285 రూపాయలు హమాలీతో కలిపి రైతుల వద్దా వసూలు చేశారు సబ్ సెంటర్ ఇంచార్జ్.అలా వసూలు చేసిన డబ్బులను సహకార సంఘనికి బస్తాకు 266.5 రూపాయలు,కొన్ని సార్లు 267 రూపాయల చొప్పున డబ్బులను సోసైటీ లో జమ చేసినట్లు సహకార సంఘం అధికారుల నుండి అందిన సమాచారం.జమ చెయ్యగా మిగిలిన డబ్బులు హమాలీకి బస్తాకు 10 రూపాయలు చొప్పున చెల్లించినట్లు సమాచారం.మిగిలిన డబ్బులు 8 రూపాయలు సొసైటీ ఉద్యోగి జేబులోకి వెళ్లినట్లు సమాచారం.అలా 10,510 బస్టాలకు సదరు ఉద్యోగి 84,080 రూపాయలు అక్రమంగా రైతుల దగ్గర వసూల్ చేసి సదరు ఇంచార్జ్ ఖాతాలో వేసుకున్నట్లు సమాచారం..ఈ నెల 2 తేదీన కంబాలపల్లి సబ్ సెంటర్లో రైతుల వద్ద నుంచి యూరియాకు ఎక్కువ డబ్బులు వసూల్ చేస్తున్నట్లు మీడియా కథనాలు రావడంతో సదరు సబ్ సెంటర్ ఇంచార్జ్ దిద్దుబాటు చర్యల్లో భాగంగా జులై 3 తేదిన సబ్ సెంటర్లో రైతులకు యూరియా బస్తాకు రెండు రూపాయలు తగ్గించి రైతుల వద్దనుండి 283 రూపాయలు తీసుకున్నారని రైతులు తెలిపారు.రైతులకు మాత్రం 266రూ,,ల బిల్లు రాసి బయ్యారం సోసైటీ పరిధి సబ్ సెంటర్స్ లో ఎక్కడ లేని విదంగా హమాలీలకు బస్తాకు 13 రూపాయల చొప్పున పెంచి తన అక్రమాలు దాచే ప్రయత్నం చేశాడు సదరు ఉద్యోగి.ఈనెల 3 నుంచి 5 వరకు 444 బ్యాగులకు అమ్మకాలు చేసి,సోమవారం 270 రూపాయల చొప్పున సొసైటీ కి 444 కట్టలకు 1,19,880 రూపాయలు సోసైటి ఖాతాలో జమ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.గతంలో అమ్మిన 10,510 యూరియా బస్తాలకు 266.5 రూపాయల చొప్పున 28 లక్షల 915 రూపాయలు సొసైటీ కి జమ చేశాడు.10510 బస్తా లకు రైతుల వద్దనుంచి 270 వసూల్ చేశాడు.ఇలా బస్తాకు 3.5 రూపాయల చొప్పున వసూల్ చేసిన 36 వేల 785 రూపాయలు సోసైటీ కి ఖాతాలో జమచేయ్యకుండా ఉన్న డబ్బులు ఎవరు వద్ద ఉన్నాయో అధికారులే తెల్చాలి.రైతులకు మాత్రం 270 రూపాయల చొప్పున సోసైటీలో జమ చేస్తున్నామని తప్పుడు మాటలు చెప్పారు అ ఉద్యోగి.ఆ బ్యాలెన్స్ డబ్బులు నెలలు గడుస్తున్న సొసైటీ ఖాతాలో ఎందుకు జమ చేయలేదనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.రైతుల వద్ద యూరియా బస్తాకు ఎక్కువ డబ్బులు వసూల్ చేస్తున్న విషయాన్ని కవరేజ్ చెయ్యడానికి వెళ్ళిన మీడియాపై ఈ నెల 4న అబద్ధపు,అపనిందలు వేస్తూ,కట్టకు 270 రూపాయల చొప్పున సొసైటీ ఖాతాలో జమ చేస్తున్నట్లు అ ఉద్యోగి రైతుల ఎదుట తెలిపాడు..కంబాలపల్లి సబ్ సెంటర్ విధులు నిర్వహిస్తున్న నాటినుండి జులై 2 వరకు రైతుల నుండి యూరియా బస్తాకు 285 రూపాయలు హమాలితో కలిపి తీసుకుంటున్నట్టు కంబాలపల్లి గ్రామంలో రైతుల ఎదుట సొసైటీ సబ్ సెంటర్ ఉద్యోగి రైతుల ముందు తెలపడం కోసమేరుపు.కంబాలపల్లి సబ్ సెంటర్ లో జరుగుతున్న యూరియా అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి సదరు ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల రైతాంగం కోరుతున్నారు.దీనిపై జిల్లా సహకార సంఘ అధికారి విజయలక్ష్మిని వివరణ కోరగా సొసైటీ సబ్ సెంటర్లో రోజుకో రేటు యూరియా అమ్మడం ఏమిటి..? అక్కడ ఏం జరుగుతుంది అనే దానిపై ఎంక్వయిరీ ఆఫీసర్ ని నియమించామని,త్వరలో సెంటర్ లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు ఉంటామని తెలిపారు.




# ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి

## -ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వర్ధన్నపేట/జూలై 6(జర్నలిస్ట్ వార్త):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు.సోమవారం వర్ధన్నపేటలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ మున్సిపాలిటీ, మండలాల బూత్ లెవెల్ ఏజెంట్లకు (బీఎల్ఏ) ఆయన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ ఇన్‌ఛార్జులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే చేయాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ ఛైర్మన్ శిభారాణి, సొసైటీ ఛైర్మన్ రాజేష్ ఖన్నా, ఐనవోలు దేవస్థానం ఛైర్మన్ ప్రభాకర్ గౌడ్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఈగ దామోదర్, పోశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంను కూలేశ్వరం చేసింది ఎవరు?

## లక్ష కోట్లు పెట్టి ప్రజల సొమ్ము దుబారా చేశారు -కాళేశ్వరంపై కెటిఆర్ డ్రామాలు కట్టిపెడితే మంచిది

## బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క

**మహబూబాబాద్,జులై 6.(జర్నలిస్ట్ వార్త)**
కాళేశ్వరం పేరుతో కెటిఆర్ డ్రామాలు చేస్తున్నారని మంత్రి సీతక్క
ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ తీరుపై పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అధికార దాహమే తప్పు... ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. కూలిపోయింది బీఆర్ఎస్ హయాంలోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ కొట్టుకుపోవాలని కేటీఆర్ చూస్తున్నారా.. అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్పు.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేక పోతున్నామని అన్నారు. నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేక పోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కేటీఆర్ కన్నా ఎన్డీఎస్ఏ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది కాక ఇప్పుడు ఎదురుదాడి విమర్శలు చేయడంపై మంత్రుఇ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.



# బైక్‌తో ఢీకొట్టి.. ప్రశ్నించిన వ్యక్తిపై దాడి

## నిందితుడికి రిమాండ్.. జైలుకు తరలించిన గీసుగొండ పోలీసులు

**గీసుగొండ/ జూలై 6 (జర్నలిస్ట్ వార్త):**




**రోడ్డు ప్రమాదానికి కారణమై, ప్రమాదంపై** నిలదీసిన వ్యక్తిపై దాడికి పాల్పడిన నిందితుడిని గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది.గీసుగొండ మండలం మచ్చాపురం గ్రామానికి చెందిన బాల్తా బుచ్చిబాబు గత మే 21న సాయంత్రం కిరాణా దుకాణం నుంచి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా, అదే గ్రామానికి చెందిన కంబాల వెంకటేష్ తన ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు.ప్రమాదంపై ప్రశ్నించిన బుచ్చిబాబుపై వెంకటేష్ తీవ్ర ఆగ్రహంతో దూషిస్తూ చేతులతో వెన్ను, భుజాలపై పిడిగుద్దులు గుద్దాడని, అనంతరం సమీపంలో ఉన్న రాయితో ఎడమ కాలి పాదంపై కొట్టడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయని పేర్కొన్నారు.
బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన గీసుగొండ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆదివారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో అతడిని జైలుకు తరలించారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ స్పష్టం చేశారు.